క్లుప్తంగా

నోట్ బుక్స్ పంపిణీ


నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న రాఘవేందర్

కొత్తూరు: కొత్తూరు పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 35 మంది విద్యార్థులకు బీఆర్‌ఎస్ యువ నాయకుడు మేకల రాఘవేందర్‌యాదవ్ సొంత ఖర్చులతో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వ్యాపారులు స్వచ్ఛందంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణకు తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు అనిత, అరుంద, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా రాజశేఖర్


నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

మొయినాబాద్: బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా మోత్కుపల్లి గ్రామానికి చెందిన తైదాల రాజశేఖర్ నియమితులయ్యారు. శుక్రవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం రాజశేఖర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కిరణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


మల్లాపూర్‌లో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

కొత్తూరు: మండల పరిధిలోని మల్లాపూర్ గ్రామంలో శుక్రవారం ఎంపీపీ మధుసూదన్ రెడ్డి సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో అంతర్గత రోడ్లను అభివృద్ధి చేసినట్లు వివరించారు. అంతేకాకుండా మండల పరిషత్ నిధులతో పాటు ఇతర నిధులను వెచ్చించి అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబటి ప్రభాకర్, రవినాయక్, మోడి దర్శన్, నర్సింహ్మారెడ్డి, దశరథ్‌నాయక్, దయానంద్‌రెడ్డి, తదితరులు

ఏరువాక పౌర్ణమి పూజలు


కొనగట్టు ఆలయం వద్ద ఏరువాక పౌర్ణమి గోపూజ నిర్వహిస్తున్న పూజారి, భక్తులు

చేవెళ్ల: మండల కేంద్రంలోని కొనగట్టు వద్ద భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఏరువాక పౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఏరువాక పౌర్ణమి పురస్కరించుకొని అమ్మవారికి మహా అభిషేకం, పూజలు చేసి తదుపరి గోమాతకు గోపూజ, మహా నైవేద్యం సమర్పించారు. అనంతరం దేవాలయ ప్రధాన అర్చకులు సురేశ్‌కుమార్ గురస్వామి మాట్లాడుతూ గోమాత పూజ చేయటం వల్ల సర్వ దేవతల పూజ చేసినట్లని చెప్పారు. అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉంటాయన్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

తవ్వారు... మరిచారు!


ఎన్కెపల్లి గ్రామంలో మంచినీటి పైపులైన్ గుంతను పూడుస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని ఎన్కెపల్లి ప్రాథమిక పాఠశాల అంగన్‌వాడీ కేంద్రం ఎదుట మంచినీటి గేట్‌వాల్ వద్ద లీకేజీ మరమ్మతుల కోసం గుంత తవ్వి పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారిందనే కథనం శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమయ్యింది. దీనికి స్పందించిన అధికారులు మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి వెంటనే పూడ్చివేయించారు.

అలంకార ప్రాయం.. వైకుంఠ ధామాలు!

- నిర్మాణాలు పూర్తయినా నిరుపయోగం
- అంతిమ సంస్కారాలకు ముందుకురాని వైనం


స్నానపు గది



నిర్మాణం పూర్తయిన వైకుంఠధామం

కేశంపేట: గ్రామాల రూపురేఖలను మార్చాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమాన్ని తీసుకువచ్చింది. పల్లెప్రగతిలో గ్రామాల్లోని ప్రధాన సమస్యలను గుర్తించి శాశ్వత పరిష్కారాల కోసం చర్యలు తీసుకుంది. అందులో భాగంగానే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిధులతో వైకుంఠధామాల నిర్మాణాలు చేపట్టారు. జిల్లాలో 558 గ్రామ పంచాయతీలకు గాను 557 గ్రామాల్లో వైకుంఠధామాల నిర్మాణాలు పూర్తయ్యాయి.

మండలంలోని 29 గ్రామాల్లో ...

మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లో వైకుంఠధామాలు పూర్తయ్యాయి. వీటికోసం ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నుంచి రూ.12.60 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. దీంతో జిల్లాలో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనులను శరవేగంగా పూర్తి చేయించారు.


దహన సంస్కారాల దిమ్మెలు

సౌకర్యాలు కల్పిస్తున్నా...

వైకుంఠధామాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. అందులో భాగంగా గ్రామంలో ఎవరైనా మరణిస్తే దహనసంస్కారాలకు ముందుకు వస్తే అధికారులే ఉచితంగా కట్టెలతో పాటు నీటి వసతి వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఐనప్పటికీ చాలా మంది వారివారి ఆచారాలననుసంరిచి శవాన్ని కాల్చేందుకు ముందుకు రావడం లేదు. అధికారులు ఎంత ప్రయత్నించినా వైకుంఠధామాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేలేకపోతున్నారు.

కరెంట్ మీటర్ల ఏర్పాటు...

కొన్ని గ్రామాల్లోని వైకుంఠధామాల్లో బోరు మోటార్, నిర్మించిన గదుల్లో ఫ్యాన్లు, విద్యుత్ దీపాలను అమర్చారు. కొన్ని చోట్ల అవి పనిచేసేందుకు మీటర్లు కూడా ఏర్పాటు చేయించారు. ఐనప్పటికీ పూర్తి స్థాయిలో వినియోగం జరగడం లేదు.

అవగాహన కల్పించాలి...



గ్రామాల్లోని వైకుంఠధామాలను దహనసంస్కారాలకు ఉపయోగించుకోవడం కోసం ప్రజలకు అవగాహన కల్పించాలి. ఆచారాల వల్ల చాలా మంది శవాన్ని కాల్చేందుకు ముందుకు రావడం లేదు. లక్షలు ఖర్చుచేసి నిర్మించిన వైకుంఠధామాలు వినియోగంలోకి రాకుంటే నిధులు దుర్వినియోగమైనట్లే.

\- కసాబ్ ప్రభాకర్, పాపిరెడ్డిగూడ గ్రామం, కేశంపేట

కుటుంబ సభ్యులు ముందుకు రావడం లేదు

గ్రామాల్లో ఎవరైనా చనిపోతే శవాన్ని కాల్చేందుకు వారి కుటుంబ సభ్యులు ముందుకు వస్తే అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం. దహన సంస్కారాలకు అవసరమైన కట్టెలతో పాటు, నీటి వసతి ఏర్పాటు చేయిస్తున్నాం. వైకుంఠదామాల వినియోగం కోసం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

\- రవిచంద్రకుమార్ రెడ్డి, (ఇన్‌చార్జి ఎంపీడీఓ) కేశంపేట

దోషులను కఠినంగా శిక్షించాలి

- కేంద్ర విద్యాశాఖమంత్రి రాజీనామా చేయాలి:ఎస్ఎఫ్ఐ
- చేవెళ్లలో రాస్తారోకో, ధర్నా



చేవెళ్లలో రాస్తారోకో చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

చేవెళ్ల: నీట్ పేపర్ లీకేజీకి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్ కుమార్ పేర్కొన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ విషయంలో బీజేపీ నాయకుల హస్తం ఉందని, ఈ కుంభకోణంపై సిట్టింగ్‌జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ లీకేజీతో 24లక్షల కుటుంబాలు తీవ్ర ఆవేదనలో కూరుకుపోయాయన్నారు. తమ పిల్లల భవిష్యత్తు ఏమిటని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. లక్షల రూపాయలు ఖర్చు పెట్టి కోచింగ్‌లు తీసుకొని పరీక్షలు రాసిన విద్యార్థుల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న దోషులను శిక్షించడంలోనూ, ఈ వ్యవహారంపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ స్పందించకపోవడం బాధాకరమన్నారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ లీకేజీ వ్యవహారంలో బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ చేవెళ్ల మండల అధ్యక్షుడు సాయిగణేశ్, నాయకులు సమీర్, హరీష్, ప్రశాంత్, మేఘన, మౌనిక, స్వప్న, నవ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం


జయశంకర్ వర్ధంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే యాదయ్య, ఎంపీపీ విజయలక్ష్మి తదితరులు

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: తెలంగాణ సిద్ధాంత కర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సేవలు చిరస్మరణీయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం జయశంకర్ వర్ధంతి సందర్భంగా మండలకేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ కోసం జీవితాన్ని అర్పించిన గొప్ప వ్యక్తి అన్నారు. విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో చేవెళ్ల ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ శివప్రసాద్, చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజ, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు సమత, డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకటస్వామిలు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు వైభవ్‌రెడ్డి, శివారెడ్డి, చింటు, ప్రభులింగం, సత్తిరెడ్డి, మక్బుల్, మంజుల, అంజయ్య, సుధాకర్, విశ్వకర్మ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌చారి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.శంబులింగచారి, సభ్యులు వి.శ్రీనివాస్‌చారి, ఆనంద్, వేణుగోపాల్, శ్రీనివాస్, పూజారి రాఘవేందర్, లింగచారి, మోనాచారి, మాణిక్యచారి, యాదగిరి, పద్మాకర్, శేఖర్, పెంటయ్య, ప్రశాంత్, బ్రహ్మచారి, శ్రీశైలం, శ్రీధర్, శివ, శంకర్, పవన్, మహేశ్, నితిన్ తదితరులున్నారు.

మానవ అక్రమ రవాణాను నిర్మూలించండి


అవగాహన కల్పిస్తున్న ప్రజ్వల సంస్థ ప్రతినిధులు

కొత్తూరు: మానవ అక్రమ రవాణాను నిర్మూలించడం అందరి బాధ్యతగా తీసుకోవాలని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ పేర్కొన్నారు. కొత్తూరు పట్టణంలో గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రజ్వల సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రజల్వ సంస్థ 28 ఏళ్లుగా ప్రజల్లో అవగాహన కల్పిస్తుందన్నారు. అంతేకాకుండా సంస్థ తరపున సంస్థ వ్యవస్థాపకురాలు సునీత కృష్ణన్ మానవ అక్రమ రవాణపై పోరాటం చేసి ఇప్పటికీ సుమారు 29 వేల మందిని కాపాడినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం కొండప్ప, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి


కొందుర్గులో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాలతోపాటు వివిధ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సయ్యద్ హఫీజ్ పాల్గొన్నారు.

కబ్జానుంచి ప్రభుత్వ భూములను కాపాడాలి

షాబాద్ మండల కులసంఘాల జేఏసీ


తహసీల్దార్ ఎండీ అన్వర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

షాబాద్: కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని షాబాద్ మండల కుల సంఘాల జేఏసీ నాయకులు కర్రె శ్రీశైలం, బీజేపీ నాయకులు కమ్మరి కృష్ణ, బోకుల కృష్ణయాదవ్, బీఆర్ఎస్ నాయకుడు దయాకర్‌చారి శుక్రవారం తహసీల్దార్ ఎండీ అన్వర్‌కు వినతి పత్రం అందజేశారు. దామర్లపల్లి గ్రామంలో ప్రభుత్వ భూమిలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లు చేసి విక్రయిస్తున్నట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దామర్లపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 264లోని ప్రభుత్వ భూమిని కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ ఇష్టానుసారంగా భూముల పేరిట రైతుల నుంచి డబ్బులు తీసుకున్నట్లు తెలిపారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ భూములు అన్యక్రాంతం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ప్రభాకర్‌చారి, బండ కుమార్, అనిల్, బండ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తి ప్రదాత జయశంకర్

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్


న్యూసిటీ కాలనీలో నివాళులర్పిస్తున్న అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

షాద్‌నగర్: తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ అని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలో న్యూసిటీ కాలనీలోని పార్కులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మెన్ ఎంఎస్ నటరాజన్, ఈటగణేష్, రాజావరప్రసాద్, జూపల్లి శంకర్, లక్ష్మీనర్సింహ్మారెడ్డి, యుగేందర్, కడెంపల్లి శ్రీనివాస్, ఒగ్గుకిషోర్, రాజ్యలక్ష్మి, ప్రసాద్ యాదవ్, సుధీర్ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి

ఎంపీపీ కోట్ల ప్రశాంతి మహేందర్‌రెడ్డి, ఎంఈఓ శంకర్‌రాథోడ్


దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కోట్ల ప్రశాంతి మహేందర్‌రెడ్డి, ఎంఈఓ శంకర్‌రాథోడ్

షాబాద్: ప్రభుత్వ పాఠశాలలో విద్య ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని షాబాద్ ఎంపీపీ కోట్ల ప్రశాంతి మహేందర్‌రెడ్డి, ఎంఈఓ శంకర్‌రాథోడ్ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని వెంకమ్మగూడ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఎస్ఎంసీ మాజీ చైర్మన్ ఎస్ నర్సింహులు, కొనింటి శేఖర్, రాజేందర్‌లు పాఠశాలలో మరమ్మతు పనులు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఏడాదికి రెండు జతల బట్టలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు అన్ని అర్హతలు కలిగి ఉన్నట్లు చెప్పారు. ప్రతీ ఉపాధ్యాయుడు ప్రతీ ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి లక్ష్మణ్, కాంప్లెక్స్ హెచ్ఎం విష్ణవర్ధన్‌రెడ్డి, ఏఏపీ చైర్మన్ సరిత, పీఆర్‌టీయూ కార్యదర్శి కృష్ణయ్య, పాఠశాల హెచ్ఎం సింహాద్రినాయుడు, మహేందర్, గ్రామ యువకులు శ్రీకాంత్, రవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను ఆక్రమిస్తున్నారని నిరసన

శంకర్‌పల్లి: తమ గ్రామంలో ఏళ్ల నుంచి ఉపయోగించుకుంటున్న శ్మశానవాటిక స్థలాన్ని తమదంటూ అదే గ్రామానికి చెందిన జొన్నాడ నర్సింలు అనే వ్యక్తి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నాడని మండలంలోని కొజ్జగూడెం గ్రామస్థులు శుక్రవారం నిరసన తెలిపారు. 1.12 ఎకరాల స్థలంలోని శ్మశానవాటికను 2021లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు పత్రాలు చూపిస్తున్నాడని, ఆ స్థలం 1955 నుంచి రికార్డుల్లో శ్మశానవాటిక పేరిట ఉన్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తులు గ్రామానికి చెందిన వారు కాదని స్పష్టం చేశారు. ఈ విషయంలో పట్టించుకునే వారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి, అక్రమ రిజిస్ట్రేషన్‌ని రద్దు చేసి, తమ స్మశానవాటికను తమకే కెటాయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


శ్మశానవాటిక వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

యోగాతోనే ఆరోగ్యం

ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. రాజకీయ నాయకులు, అధికారులు పాల్గొని యోగా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నిత్యం యోగా చేసే వారు ఎల్లప్పుడు ఆరోగ్యంగా ఉంటారన్నారు. వయస్సుతో నిమిత్తం లేకుండా యోగా చేయొచ్చన్నారు.


చేవెళ్లలోని ఆదర్శపాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు


షాబాద్: పోతుగల్ ఉన్నత పాఠశాలలో యోగా చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి అశోక్


కొత్తూరు: విద్యార్థులకు యోగాసనాలు నేర్పిస్తున్న బీఆర్ఎస్ నేత దేవేందర్‌యాదవ్


కేశంపేట: అవగాహన కల్పిస్తున్న స్పిరిచ్‌వల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి ఆంజనేయులు


మొయినాబాద్ రూరల్: ఫిట్ భారత్ త్రూ యోగా పుస్తకాన్ని ఆవిష్కరించిన చెతన్య డీమ్డ్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రవీందర్


షాద్‌నగర్‌లో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు


షాద్‌నగర్: రాయికల్ ప్రభుత్వ పాఠశాలలో


షాబాద్: పోతుగల్ ఉన్నత పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు


చేవెళ్ల: అంతారం పాఠశాలలో ఆసనలు వేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు